# చలివేంద్రముచ్చట్లు

శ్రీమతి కొప్పర్తి సత్యవతమ్మగారు

## ౧

## చలివేంద్రవద్ద నొకవృద్ధబ్రాహ్మణుడు

చలివేంద్రవద్దకు యథాప్రకారము వేంకటనరసమ్మగారు భోజనముచేసి వెళ్లి బాటసారులకు దాహము ఇచ్చుచుండెను. మధ్యాహ్నము రెండుగంటలయ్యెను. భానుడు తీవ్రముగ ప్రకాశించుచుండెను. వడగాడుపు విసరుచుండెను. అంత నొకవృద్ధబ్రాహ్మణుడు చలివేంద్రవద్దకు ఎట్లనో ప్రాణములు చేరవేసెను.

"అమ్మయ్యా! బ్రతికితిని. ఈ సత్రముపెట్టిన మహానుభావుని యిల్లు వెయ్యిళ్లు మొదలు కావలయును. ఈ వేసవికాలములో ఇంతకంటె చేయతగిన పుణ్యకార్యమేమున్నది?" అని తనలో అనుకొనుచు "ఎవరండీ సత్రములోను? దాహమగుచున్నది." అని ప్రకాశముగా పలికెను.

అంత వేంకటనరసమ్మగారు దయార్ద్రహృదయముతో ఆ వృద్ధబ్రాహ్మణుని ఆహ్వానించి ఒక ఇత్తడి చెంబుతో కాళ్లుకడుగుకొనుటకు నీరమును, ఒక కంచుచెంబుతో దాహముతాగుటకు నీర్మజ్జిగయు నిచ్చెను. వృద్ధబ్రాహ్మణుడు కాళ్లుకడుగుకొని శ్రమవాసి దాహముతాగి సేదదేరెను. "అమ్మయ్యా! బ్రతికితిని. అమ్మా! మీకు ఎంతపుణ్యమండి" అని బ్రాహ్మణుడనెను.

"అయ్యా! విప్రోత్తమా! ఎక్కడికి పోవుచుంటిరోగాని ఎండ అతితీవ్రముగానున్నది. జరాభారమున అలసియున్న మీశరీరము ఈతీవ్రాతపమునను తాళజాలదు. కావున ప్రొద్దువాటారువరకు ఇందు ఈ చిటిచాపమీద విశ్రమింపుడు."

బ్రాహ్మణుడు విశ్రమించి "అమ్మా! మీ ఇంటిపేరేమి?" అని అడిగెను.

"మా యింటిపేరెందుకులెండి."

"అమ్మా! మిమ్ములను చూచినను, మీరు చేయుచున్న పుణ్యకార్యమును తలచినను నాకు మహనీయురాలు డొక్కా సీతమ్మగారు జ్ఞాపకము వచ్చుచున్నారు. మన గోదావరిజిల్లాలలో ఆమె నామము వినని వారులేరు. మీరు ఆమెవంటి పుణ్యజీవనులై యున్నారు కావున తెలిసికొనవలెనని కుతూహలముగలిగి అడుగుచున్నాను."

"డొక్కా సీతమ్మగారు—ఆ తల్లి యెక్కడ? నావంటివారెక్కడ? ఆమెకును నాకును పోలికయే లేదు."

"అమ్మా! అట్లనరాదు. చేయగలంత పుణ్యమును తమరు చేయుచునేయున్నారు. కావుననే మీయింటిపేరు తెలిసికొనుటకు నేను కుతూహలపడుచున్నాను."

"అయ్యో! మా అత్తవారింటిపేరు గురిజాడవారు."

"అమలాపురములోని గురిజాడవారును మీ అత్తవారునుజ్ఞాతులా?"

"మా అత్తవారు అమలాపురమే."

"అట్లాగునా? మీ మామగారిపేరు?"

"సంపదరాయుడుగారు"

"ఓహో! సంపదరాయుడుగారా? వారిని నేను బాగాయెఱుగుదును. వారికొడుకులలో ఎన్నవవారు మీ భర్తగారు?"

"నా పెండ్లినాటికి రెండవవారు."

"అయనా? అయన్ని రామదాసు అని చెప్పుకునేవాళ్లు మాయింట్లో ఆడవాళ్లు."

"ఆయనేనండి నా కొంపతీస్త."

"ఆయనకు రెండవపెండ్లి అని చెప్పుచుండెడివారు. మొదటిభార్య ఎవరు?"

"ఎవరో ఎక్కడ? మా అక్కగారినే మొదట యిచ్చినారు. పెండ్లిఅయిన నెలరోజులకే ఆమె పెద్దలలో కలసినది. తరువాత నన్ను యిచ్చినారు. నేను ఆరుసంవత్సరములు కాపురముచేశాను. ఆనందముతో ఆరుసంవత్సరములు ఆరునిముషములట్లు గడచినవి. అప్పుడు మా వారికి గుంటూరులో పని. నెలకు ముప్పదియైదు రూపాయిలు జీతము. బ్రాడీపేటలో కాపురము. ఆరుసంవత్సరముల అనంతరము మా వారికి దేహములో కాయిలా ప్రవేశించినది. నెలరోజులు సెలవుపుచ్చుకొని వారిస్వగ్రామమగు అమలాపురమువచ్చినాము. వచ్చిన మూడవరోజుననే హంస లేచిపోయినది. అనాథనై పుట్టినింట ఇట్లు ప్రొద్దులు పుచ్చుచున్నాను."

"అమ్మా! సుకృతీగతాయువని పెద్దలనుమాట ఊరకపోదు. ఆయనను దైవము ఎత్తుకొనిపోయినాడు. పాపము మీ ధర్మమేనా కాసినదికాదు. మీ మామగారగు సంపదరాయుడుగారి సంతానములో మంచి తనమునకు మీవారు, రాశిపోసిన చెడ్డతనమునకు మీ పెద్దఆడుబిడ్డ. మంచివారికి మరణము ముందువచ్చును. కావున మీవారు వారిదారిని వారుపోయినారు. మీపెద్దఆడుబిడ్డమాత్రము అందఱి ఆయువు పోసుకొని ఉట్టిగట్టుకొనిఉండి అందఱిని ఆడిపోయుచున్నది. ఆ పాప మెప్పుడుపండునో?"

"అయ్యో! ఆమెసంగతి మనకెందుకులెండి. ఆమె బరువు మనమేమి మోసుకొన్నాము."

"అమ్మా! మీ హృదయము మంచిదికాబట్టి అట్లనుచున్నారు. ఆమె మంచిచెడ్డలు అమలాపురములో అందఱు ఎఱుగుదురు. పోనీలెండి. ఆమెసంగతి మనకెందుకు? తల్లీ! మీరుమాత్రము మంచిపని చేయుచున్నారు. విచారములో ఒకచోట కూర్చుండి ఉండకుండా చలివేంద్రపెట్టి నీటికొఱకు గోటాపస ఎత్తివచ్చు బాటసారులకు చల్లని నీరుమజ్జిగ ఇచ్చి ప్రాణములు నిల్పుచున్నారు. మీకు ఎంతేని పుణ్యమువచ్చును. తల్లీ! ప్రొద్దుకొంచము వాటారినది. నేను పోవలసిన ఊరు ఇంకను చాలదూరమున్నది. పెందలకడనే పోయి వెలుగుండగనే ఉప్పుటేరు దాటవలసియున్నది. కావున పోయివస్తాను."

వృద్ధబ్రాహ్మణుడు వెడలిపోయెను. సూర్యాస్తమయమైనవెంటనే వేంకటనరసమ్మగారు చలివేంద్రమూసి సమీపముననేయున్న ఇంటికివెళ్లెను.